ఆ అంగన్‌వాడీలో ఆయానే టీచరు

- 28 మంది చిన్నారులకు అక్షరాలు నేర్పిస్తున్న ఆయా పద్మ

చిన్నారులకు విద్యాబోధన చేస్తున్న ఆయా పద్మ

వంట చేస్తున్న అంగర్‌వాడీ ఆయా

మెదక్‌రూరల్, జనవరి 19: చిన్నారుల్లో చదువుకు బీజం పడేందుకు ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి. కానీ ప్రభుత్వంతో పాటు అధికారుల నిర్లక్ష్యంతో ప్రాథమిక విద్యకు సంకట పరిస్థితులు ఎదురవుతున్నాయి. అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలిని నియమించకపోవడంతో అక్కడ పనిచేస్తున్న ఆయానే టీచరుగా మారి చిన్నారులకు అక్షరాలు దిద్దిస్తున్నది. మెదక్ మండలంలోని పాతూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రం -1లో 28 మంది చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేసిన మహిళ రెండేండ్ల కిందట మృతిచెందింది. దీంతో అప్పటి నుంచి టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటికీ కొత్తవారిని నియమించక పోవడంతో అందులో పనిచేస్తున్న ఆయానే చిన్నారులకు అక్షరాలు దిద్దిస్తున్నది. ఆమె వంట చేసి పెడుతున్నది. విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నది. పక్కనున్న అంగన్‌వాడీ టీచర్‌కు ఇన్‌చార్జి బాధ్యత అప్పగించినా, ఆమె అక్కడికి రావడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ టీచర్ పోస్టును భర్తీ చేయలని తల్లిదండులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సర్దుబాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీకి రాష్ట్ర కమిషనరేట్ నుంచి నోటిఫికేషన్ రావాలి. ఆ తర్వాత భర్తీ చేస్తాం. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పక్క కేంద్రం టీచర్‌కు అప్పగించాం. పాతూరు అంగన్‌వాడీ కేంద్రాం-1లో చిన్నారులు ఎక్కువగా ఉన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్కువ మంది పిల్లలు ఉన్న అంగన్వాడీ కేంద్రం నుంచి టీచర్‌ను సర్దుబాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం.

- హేమవతి మహిళాశిశు సంక్షేమ అధికారి మెదక్

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగాయ్యగారి రాజిరెడ్డి, సుభాష్ రెడ్డి, పాల్టీ చేగుంట మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి ఆదివారం కలిశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

- చేగుంట, జనవరి 19

ఏడుపాయల్లో భక్తుల సందడి

ఏడుపాయల వనదుర్గా మాత సన్నిధిలో భక్తులు

పూజలందుకుంటున్న అమ్మవారు

పాపన్నపేట, జనవరి 19: ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఈవో చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేసేలా

ప్రభుత్వానికి బుద్ధిని ప్రసాదించాలి

చిలిపిచెడ్: చాముండేశ్వరీ అమ్మవారి దర్శించుకుంటున్న నర్సాపూర్ ఎమ్మెల్యే

నర్సాపూర్‌లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్: హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే

- **నర్సాపూర్‌లో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తా**
- **నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**
- **లక్ష్మీ నరసింహాస్వామికి పట్టు వస్త్రాలు సమర్పణ**
- **నేటి నుంచి మూడు నెలల పాటు లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు**

శివ్వంపేట, జనవరి 19: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేసేలా కాంగ్రెస్ ప్రభుత్వానికి లక్ష్మీ నరసింహస్వామి బుద్ధి ప్రసాదించాలని కోరినట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం సికిందర్లాపూర్ పంచాయతీ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద ఏటా మూడు నెలల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ జాతరను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యే అధికారికంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతనమైన ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉన్నదని, స్వామి వారి అనుగ్రహంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు నెరవేర్చేలా బుద్ధిని ప్రసాదించాలని మొక్కుకున్నానన్నారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవో శశిధర్ గుప్తాకు తెలిపారు. భక్తులకు ఆలయ ప్రధాన పూజారి ధనుంజయశర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గుట్టపైకి రూ.15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, జనవరి 19: క్రీడాకారులకు అందుబాటులో ఉండేందుకు నర్సాపూర్‌లో స్టేడియాన్ని త్వరలో నిర్మించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వారం రోజులుగా జరుగుతున్న నర్సాపూర్ ప్రీమియం లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ఫైనల్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సాపూర్‌లో స్టేడియం నిర్మాణానికి గతంలో రూ.2.5 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ఇంకో రూ.5 కోట్లు ప్రభుత్వం నుంచి రాబట్టి మొత్తం రూ.7.5 కోట్లతో స్టేడియం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలో స్టేడియం నిర్మాణానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించారన్నారు. వీటితో పాటు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. టోర్నీలో సుభాష్ యాదవ్ జట్టు, సూర్య ఇంటీరియర్స్ జట్టు ఫైనల్‌లో తలపడ్డాయి. ఇందులో సుభాష్ యాదవ్ జట్టు విజయం సాధించింది. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. నత్నాయిపల్లి గ్రామంలో జరుగుతున్న జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సన్మానించారు.

రెండు లక్షల ఎల్ఓసీని అందజేసిన ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి రూ.2 లక్షల ఎల్ఓసీని హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చింతల రాణి నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఆమె ఆపరేషన్‌కు మంజూరైన రూ.2లక్షల ఎల్ఓసీని పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో లింగాపూర్ మాజీ సర్పంచ్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనర్సయ్య, అంజయ్య, విఠల్, లింగం పాల్గొన్నారు.

చాముండేశ్వరీ ఆలయ వార్షికోత్సవాల్లో ఎమ్మెల్యే

చిలిపిచెడ్, జనవరి 19: చిట్కుల్‌లో మంజీరా నది తీరాన వెలిసిన చాముండేశ్వరీ ఆలయ 42వ వార్షికోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. చాముండేశ్వరీ అమ్మవారిని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేశారు. ప్రధాన అర్చకుడు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు యాదాగౌడ్, మహిపాల్ రెడ్డి, హనుమంత్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుంట లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, సురారం నర్సింలు, గోవింద్ నాయక్, రాకేశ్ రెడ్డి, రేణు కుమార్, సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి, వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు మీనా ప్రసన్న, మాజీ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గడ్డం నరేందర్‌రెడ్డి, మాజీ మండల రైతు సమన్వయ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, లక్ష్మణ్, యాదగిరి, భిక్షపతి, నర్సాపూర్ మున్సిపల్ వైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ వైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు షేక్‌హుస్సేన్, సూరారం నర్సింహులు, సుధాకర్‌రెడ్డి, నాగరాజుగౌడ్, చంద్రాగౌడ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డు జారీ

పాతూరులో రేషన్ కార్డుల వెరిఫికేషన్‌ను పరిశీస్తున్న కలెక్టర్

కొడిపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

- **సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ**
- **21 నుంచి గ్రామసభలు ప్రారంభం**
- **కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ రూరల్, జనవరి 19: అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం మెదక్ మండలంలోని పాతూర్ గ్రామంలో కొత్త రేషన్‌కార్డ్ వెరిఫికేషన్‌ను క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుడి వరకు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు. ఇంతకుముందు జరిగిన సర్వేల్లో ఎప్పుడు దరఖాస్తు ఇవ్వక పోయినా గ్రామసభలో ఇవ్వొచ్చన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని, ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులనూ పరిశీలిస్తారని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ నగేశ్

కౌడిపల్లి, జనవరి19: ఆహార భద్రత కార్డుల సర్వేను పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. మండల కేంద్రంలో పంచాయితీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తుండగా అదనపు కలెక్టర్ హాజరై, సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డు అదించేందుకు వీలుగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్, ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

మెదక్ చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 19: మెదక్ చర్చిలో భక్తులు, పర్యాటకులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు, పర్యాటకులో చర్చి ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గంట గంటకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రార్థనల్లో ప్రెసిబేటరి ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య, చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువర్ణ డగ్లస్, జాన్సన్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు.

రామాయంపేటలో ఫిట్ ఇండియా సైక్లింగ్ డ్రైవ్

ఫిట్ ఇండియా సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న కోచ్ దండు యాదగిరి

రామాయంపేట, జనవరి 19: ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ సైకిల్ తొక్కాలని జాతీయ సైక్లింగ్ అవార్డు గ్రహీత, సైక్లింగ్ కోచ్ దండు యాదగిరి అన్నారు. ఆదివారం రామాయంపేటలోని మెదక్ చౌరస్తాలో సైక్లింగ్ అకాడమీ ఆధ్వర్యంలో సైక్లింగ్‌ను ప్రారంభించారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ వారంలో ఒక్కరోజు సైకిల్‌ను పది కిలోమీటర్లు తొక్కితే అనారోగ్యం బారిన పడకుండా ఉంటామన్నారు. సైక్లింగ్ ఫెడరేషన్‌లో చేరి ప్రతి ఆదివారం గంట పాటు సైక్లింగ్ రేస్‌లో పాల్గొనాలన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత

కొల్చారం, జనవరి 19: మండలంలోని ఎనగండ్ల గ్రామంలో కీర్తి శేషులు వడ్ల మల్లయ్య జ్ఞాపకార్థం అయ్యప్ప ఎంటర్ ప్రైజెస్ యజమాని వడ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎనగండ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ నిర్వహించారు. టోర్నీలో మొత్తం ఐదు జట్లు పాల్గొన్నాయి. కే.శ్రావణ్ జట్టు విజేతగా నిలిచింది. సంతోష్ జట్టు రెండో స్థానంలో ఉంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రమేశ్ (ఫైల్)

చిన్నశంకరంపేట, జనవరి 19: కరెంట్ షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు నర్ర రమేశ్ (48) పొలం పారించేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావి వద్ద కరెంటు మోటర్ నడవకపోవడంతో స్టార్టర్‌కు మరమ్మతులు చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై, అక్కడే కుప్పకూలిపోయాడు. రమేశ్ ఇంటికి తిరిగి రాకపోయే సరికి కుమారుడు మధు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా రమేశ్ కింద పడి ఉన్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం నార్సింగిలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అప్పటికే రమేశ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య గంగమణి, కుమారుడు మధు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

విద్యార్థులకు ఉచితంగా విలువిద్య



విలువిద్య నేర్పిస్తున్న నిర్వాహకుడు

రామాయంపేట, జనవరి 19: పట్టణంలోని విద్యార్థులకు ఉచితంగా విలువిద్య శిక్షణ ఇస్తానని, ఆసక్తిగల వారు తమ పేర్లను భారతి భవన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా హాకీ అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షుడు బొంతల సత్యనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని కళాశాల గ్రౌండ్‌లో విలువిద్యను ప్రారంభించారు.

పాలాల దారుల్లో మట్టిరోడ్ల పనులు

ఎదుల్లాపూర్ లో మట్టి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ

శివ్వంపేట, జనవరి 19: పొలాలకు వెళ్లే దారుల్లో మట్టి రోడ్లు నిర్మిస్తున్నట్లు ఎంపీపీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ అన్నారు. ఆదివారం సెహగల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. పొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం సెహగల్ సంస్థకు తెలపడంతో గ్రామ శివారులోని ముత్తయ్య చెరువు నుంచి రిజర్వ్ ఫారెస్ట్ వరకు మట్టి రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆ సంస్థ సహకారంతో పాత బావులన్నింటినీ పూడ్చివేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటేశ్, సునందారెడ్డి, పోచయ్య, మాజీ ఉపసర్పంచులు యాదిరెడ్డి, పాండురంగం, మాజీ ఎంపీటీసీ గోవింద్ నాయక్, డాక్టర్ సంతోశ్, జైపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, రాములు, శ్రీనివాస్ రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చేగుంట, జనవరి 19: జీవితంపై విరక్తి చెంది వివాహిత రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన వడియారం రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన తిరుపతి మౌనిక (22) ఒంటరిగా నివసిస్తున్నది. జీవితంపై విరక్తి చెందిన మౌనిక ఆదివారం రాత్రి నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు కింది పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో రెండు కాళ్లు పూర్తిగా పోయాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది రమేశ్‌నాయక్, లింగులాల్ రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు, పరిస్థితి విషమించడంతో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

సురేష్ (ఫైల్)

చేగుంట, జనవరి 19: ఆగి ఉన్న బైకును వెనుక నుంచి వేగంగా వచ్చి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డెర కాలనీ సమీప జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఎస్సై అహ్మద్ మొయినొద్దీన్ కథనం ప్రకారం.. నిజాంపేట మండలం బచ్చురాజ్‌పల్లికి చెందిన సురేష్ (24) నార్సింగి మండలం జెప్తిశివనూర్‌కు చెందిన ప్రసాద్ బైకుపై చేగుంట వైపు వస్తున్నారు. నార్సింగి గ్రామ శివారులోని వడ్డెర కాలనీ వద్దనున్న మల్లన్న దేవాలయం కమాన్ వద్ద నుంచి బయలుదేరుతున్నారు. రామాయంపేట వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఆ బైకును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైకు వెనుక కూర్చున్న సురేష్, కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్‌కు గాయాలయ్యాయి. ప్రసాద్‌ను చికిత్స కోసం దవాఖానకు తరలించారు. నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభించేనా?

శౌకత్‌పల్లి తండాలో ప్రారంభం కాని బీటీ రోడ్డు పనులు

నిజాంపేట, జనవరి 19: మండలంలోని తిప్పనగుల్ల నుంచి శౌకత్‌పల్లి తండా వయా వడ్డెర కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.35 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు నవంబర్ 25న శౌకత్‌పల్లి తండాలో బీటీ రోడ్డు పనులకు మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు 55 రోజులు అవుతున్నా ఆ రోడ్డు పనులు నేటికీ ప్రారంభం కాలేదు. బీటీ రోడ్డు నిర్మించి తమ సమస్య పరిష్కరించాలని శౌకత్‌పల్లి తండావాసులు, తిప్పనగుల్ల గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించండి

నిజాంపేట, జనవరి 19: బీటీ రోడ్డు సమస్యను పరిష్కారించాలని నస్కల్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం 9 రోజులుగా నిజాంపేట రోడ్డుపై రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. దీక్షలో గ్రామస్తులు సిద్దిరాములు, మైసయ్య, దుర్గయ్య, ఎల్లంయాదవ్, లింగం, హబీబ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్, జనవరి 19: ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య అని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ ఖండించారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు రాములుపై పాఠశాలలో విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

తపస్ జిల్లా మహిళా కార్యదర్శిగా సుజాత

సుజాత

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 19: తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శిగా చిట్కుల్ జడ్పీహెచ్ఎస్ టీచర్ సుజాతను నియమిస్తూ జిల్లా అధ్యక్షురాలు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో కార్యదర్శిగా నియమించిన జిల్లా అధ్యక్ష కార్యదర్శులకు సుజాత కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

రామాయంపేట, జనవరి 19: బాధిత కుటుంబాలకు లీలాగ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌నాయక్ ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. పట్టణానికి చెందిన డాకి యాదగిరి వారం రోజుల క్రితం మృతి చెందాడు. బీసీ కాలనీకి చెందిన డాకి నర్సింహులు 15రోజుల క్రితం చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. మృతుల కుటుంబాలకు మోహన్‌నాయక్ రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. గొల్పర్తిలో ఇంటి పై కప్పు కూలి నిరాశ్రయులైన కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. గుగ్లోత్ శ్రీనివాస్, సురేశ్, అస్నుద్దీన్, సాజిత్ ఉన్నారు.

మనోహరాబాద్ బీజేపీలో వర్గపోరు

మనోహరాబాద్, జనవరి 19: మనోహరాబాద్ మండలం బీజేపీలో వర్గపోరు నడుస్తోంది. రెండు వర్గాలుగా పార్టీ చీలిపోయింది. పోటాపోటీగా ఎవరి వర్గం వారు వారికి వారే సమావేశాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తూ మొదటి నుంచి బీజేపీ కోసం కష్టపడి పనిచేసిన తమను పక్కన బెట్టారంటూ బీజేపీ సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మనోహరాబాద్‌లో ఎంపీ రఘునందన్‌రావు సమావేశానికి తమను దూరంగా ఉంచడం, అదే విధంగా పార్టీ మండల అధ్యక్ష పదవి ఎన్నికకు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కొత్త వారికి పార్టీ మండల అధ్యక్ష పదవిని కట్టబెట్టడం, పార్టీ కార్యకలాపాలకు ఆహ్వానించక పోవడంతో బీజేపీ సీనియర్ నాయకులంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధ్యక్ష పదవి ఎన్నికపై వచ్చిన వార్తల వివాదం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. వారం క్రితం ఓ వర్గం బీజేపీ నేతలు సీనియర్ నాయకులను దూరం పెట్టి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. దీంతో కోపంతో రగలిపోతున్న సీనియర్ బీజేపీ నాయకులంతా ఒకతాటిపైకి వచ్చి సై అంటే సై అన్నట్లు ఆదివారం ఆయా గ్రామాల సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతనంగా బూత్ కమిటీలను సైతం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్ సింగ్ ఠాకూర్, జిల్లా సీనియర్ నాయకుడు అజయ్‌కుమార్, మండల నాయకుడు నరేశ్ గౌడ్, నాయకులు మహేశ్, బాలకృష్ణ, మల్లేశ్, నర్సింలు, దుర్గేష్, రాజేశ్, భూపాల్‌రెడ్డి, కిరణ్, శ్రీకాంత్, రితేశ్, విజయ్, నాగరాజు, యాదగిరి, శివ, మురళి, పవన్ పాల్గొన్నారు.